


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | మంగళవారం 14-03-2023 | సంపుటి : 04 | సంచిక : 174 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## ఎన్నికలు అపహాస్యమవుతున్నా చర్యలు తీసుకోరా?: చంద్రబాబు



అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికలు అపహాస్యం అవుతుంటే అధికారులు చర్యలకు దిగకపోవడం దారుణమని తెదేపా అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యనేతలతో ఆయన చర్చించారు. పోలింగ్‌లో అక్రమాలు, వైకాపా దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులను పార్టీ నేతలు అధినేతకు వివరించారు. నేతలు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాల నేపథ్యంలో వైఎస్సార్, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో చోటుచేసుకున్న అక్రమాలు, ఉదయం నుంచి జరిగిన ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి బస్సులు, ప్రత్యేక వాహనాల్లో ప్రజలను తరలించి దొంగ ఓట్లు వేయిస్తున్నా యంత్రాంగం మౌనంగా ఉందని ఆయన ఆరోపించారు. పట్టభద్రులు ఓటు వేయాల్సిన ఈ ఎన్నికల్లో అనర్హులు, నిరక్ష్యరాస్యులతో వైకాపా నేతలు బోగస్ ఓట్లు వేయిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. దీనిపై రాజకీయపక్షాలు చేసే ఫిర్యాదులను ఎన్నికల అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతిలో బోగస్ ఓట్లపై అభ్యంతరాలు తెలిపిన తెదేపా నేతలను పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. మరోవైపు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ ప్రకాశం జిల్లా ఎస్పీకి చంద్రబాబు ఫిర్యాదు చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కు విజయసాయిరెడ్డి దూరం



న్యూఢిల్లీ మార్చ్ 13 ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కి వెన్నుదన్నుగా నిలిచిన ఎంపీ విజయసాయిరెడ్డి నేడు మాత్రం ఆయనకు ఝలక్ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కు విజయసాయిరెడ్డి దూరంగా ఉన్నారు. వైజాగ్ లో విజయసాయిరెడ్డి తన ఓటును నమోదు చేసుకున్నారు. అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు వైసీపీ తరుపున పోటీ చేసిన అభ్యర్థులకు మద్దతుగా నిలవాల్సిన విజయసాయిరెడ్డి.. ఢిల్లీకి వెళ్లిపోయారు. వైవీ సుబ్బారెడ్డిని ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా నియమించిన తరువాత విజయసాయిరెడ్డి అలకబూనినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికీ విజయసాయిరెడ్డి దూరంగా ఉన్నారు. అసలు జగన్‌కు విజయసాయిరెడ్డికి ఇటీవలి కాలంలో సరిగా పడటం లేదన్న టాక్ అయితే జిల్లాలో నడుస్తోంది. సినీ నటుడు తారకరత్న అంత్యక్రియల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు తో విజయసాయిరెడ్డి చనువుగా ఉండటంపై జగన్ ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి చంద్రబాబు, లోకేశ్ లకు వ్యతిరేకంగా మాట్లాడాలని విజయసాయిరెడ్డిని జగన్ ఆదేశించినట్లు తెలుస్తోంది. కానీ జగన్ ఆదేశాలను పక్కన పెట్టి విజయసాయిరెడ్డి ఢిల్లీ కి వెళ్లినట్టు సమాచారం. ఈ క్రమంలోనే జగన్ మరింత ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది.

# చరిత్ర సృష్టించిన ఆర్ఆర్ఆర్..

# 'నాటు నాటు' పాటకు ఆస్కార్



లాస్ఎంజిల్స్,మార్చి13: ఎప్పుడెప్పుడా అని తెలుగు ప్రేక్షకులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన క్షణం రానే వచ్చింది. ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించింది. ఎమ్.ఎమ్ కీరవాణి, చంద్రబోస్ ఆస్కార్ అవార్డులు అందుకున్నారు. ప్రపంచ వేదికపై తెలుగు సినీ కీర్తి పతాకం రెపరెపలాడింది. ఖండాంతరాలకు వ్యాపించిన తెలుగోడి ప్రతిభకు ఆస్కార్ పట్టం కట్టింది. దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కించిన ఈ సినిమాలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ నటించారు. వరల్డ్ వైడ్‌గా 81 పాటలు ఆస్కార్‌కు ఎంట్రీ ఇవ్వగా.. తుది జాబితాలో ఐదు పాటలు ఆస్కార్‌కు షార్ట్ లిస్ట్ అయ్యాయి. నాటు నాటు తో పాటు టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్ (అప్లాజ్), హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్:మావెరిక్), లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్), దిస్ ఈజ్ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్) పాటలు ఆస్కార్‌కు పోటీ పడగా.. నాటు నాటు పాట ఆస్కార్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఇప్పటికే ఎన్నో ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకున్న నాటు నాటు పాటకు ఇప్పుడు ఆస్కార్ రావడంతో భారతీయ సినీ ప్రేక్షకుల ఆనందానికి అవదుల్లేకుండా పోయాయి. ఇటీవలే ఆస్కార్ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మక అవార్డుగా భావించే గోల్డెన్ గ్లోబ్ అవార్డును నాటు నాటు పాట గెలుచుకుంది. ఆ అవార్డు గెలుచుకున్న తొలి ఆసియా పాట ఇదే. రిహాన్నా పాడిన లిఫ్ట్ మి అప్, టేలర్ స్విఫ్ట్ పాడిన కరోలినా, లేడీ గాగా పాడిన హోల్డ్ మై హ్యాండ్ పాటలను వెనక్కి నెట్టి.. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డును కైవసం చేసుకోవడం విశేషం. మరో ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ అవార్డు క్రిటిక్స్ చాయిస్‌ను కూడా నాటు నాటు దక్కించుకుంది. ఇందులో బెస్ట్ సాంగ్ అవార్డును నాటు నాటు సొంతం చేసుకోగా, ఉత్తమ విదేశీ భాషా చిత్రంగా ఆర్ఆర్ఆర్ నిలిచింది. ఉత్తమ పాట విభాగంలో హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ (ఊఅం) అవార్డును నాటు నాటు సొంతం చేసుకున్నది. బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ స్టంట్స్,



ఉత్తమ అంతర్జాతీయ చిత్రం విభాగాల్లో ఆర్ఆర్ఆర్ సినిమా హెచ్‌సీఏ అవార్డులు దక్కించుకున్నది. బెస్ట్ సాంగ్ విభాగంలో హ్యూస్టన్ ఫిల్మ్ క్రికెట్ సొసైటీ అవార్డును కూడా నాటు నాటు కైవసం చేసుకున్నది. అదేవిధంగా ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆన్‌లైన్ ఫిల్మ్ క్రిటిక్స్ సొసైటీ (ాఈఊ) అవార్డును సైతం ఈ పాట సొంతం చేసుకోవడం

గమనార్హం. ఎమ్.ఎమ్ కీరవాణి స్వరపరిచిన నాటు నాటు పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించాడు. కాల భైరవ, రాహుల్ సిప్లీగంజ్ ఆలపించారు. ప్రేమ్ రక్షిత్ స్వరాలు సమకూర్చాడు. ఈ పాటకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా రమా రాజమౌళి పనిచేసింది. ఇంతకుముందు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించిన స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయహో' పాటకు ఆస్కార్ వచ్చింది. దీనిని హాలీవుడ్ దర్శకుడు డానీ బోయల్ తెరకెక్కించారు.

## తెలుగు సినిమా జెండా రెపరెపలాడింది


### ఆర్ఆర్ఆర్ టీమ్‌కు జగన్, చంద్రబాబు అభినందనలు

అమరావతి: ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు'కు ఆస్కార్ రావడంపై ఏపీ సీఎం జగన్, తెదేపా అధినేత చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు పాటకు అంతర్జాతీయంగా గుర్తింపు రావడం పట్ల గర్వంతో ఉప్పొంగిపోతున్నట్లు జగన్ చెప్పారు. దర్శకుడు రాజమౌళి, నటులు ఎన్టీఆర్, రామ్‌చరణ్, సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ సహా మొత్తం చిత్ర బృందాన్ని ఆయన అభినందించారు. తనతో సహా కోట్లాది తెలుగు ప్రజలు, భారతీయులు గర్వపడేలా చేశారని జగన్ కొనియాడారు. ఆస్కార్ పోటీలో తెలుగువారు ప్రపంచానికి టార్చ్ బేరర్‌లా నిలవటం గర్వకారణమని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. 95ఏళ్ల ఆస్కార్ చరిత్ర లో 'నాటు నాటు' పాట చరిత్ర సృష్టించి తెలుగునేలను పులకింపజేసిందని కొనియాడారు. ఆర్ఆర్ఆర్ సినిమా దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్ తదితరులకు ఆయన అభినందనలు తెలిపారు. టీమ్ లీడర్ రాజమౌళి అయినా జూ.ఎన్టీఆర్, రామ్ చరణ్, ప్రేమ్ రక్షిత్, కాలభైరవ అంతా కలిసి ఓ చరిత్ర సృష్టించారని చంద్రబాబు కొనియాడారు.



# విశాఖే రాజధాని....

విశాఖపట్టణం, మార్చి 13, విశాఖే రాజధానిగా పరిపాలన కొనసాగుతుందని వైసీపీ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నారు. ఈ మేరకు ఆయన గ్లోబల్ సమ్మిట్ వేదికగా ప్రకటించారు. రాజధానిగా విశాఖపట్నం ఖాయమని, పాలన సాగించడానికి అవసరమైన అన్ని వసతులు అక్కడ ఉన్నాయని వైఎస్సార్?సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఉగాది నుంచి విశాఖ కేంద్రంగా పాలన సాగుతుందన్న ప్రచారం కూడా జరుగు తోంది. ఈ క్రమంలో సీదిరి అప్పలరాజు అప్పల రాజు కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నం రాజధానిగా త్వరలోనే ఏర్పడుతుంది అని ఆయన అన్నారు. విశాఖ రాజధాని చేయాలని గొప్ప పాలసీ సిఎం జగన్ తీసుకువచ్చారని తెలిపారు. స్దానిక సంస్దలు, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటు హాక్కును వినియోగించుకున్న మంత్రి సీదిరి అప్పలరాజు.. విపక్ష



పార్టీపై ఫైర్ అయ్యారు. ప్రతిపక్షం దొంగ దిబ్బతీయాలనే కులాల పేరుతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్దిగా ఇండిపెండెంట్ ను బరిలో ఉంచారని అన్నారు. కులాలు ఎగదోసి, పార్టీల వెనుకుండి, అసమాన తలు రెచ్చకొట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. ఈ ఎన్నిలతో అయినా బుద్ధి తెచ్చుకోవాల న్నారు. గ్రాడ్యుయేట్స్ వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్ది సీతంరాజు సుధాకర్ కు మద్దతుగా ఉండాలని కోరారు. తమ కులం వారే బాగుపడాలని లక్ష్యంతో అమరావతి రాజధాని కావాలంటూ టీడీపీ కోర్టుకు వెళ్లిందని మండిపడ్డారు. చంద్రబాబు వైఖరిని గ్రాడ్యుయేట్స్ గ్రహించాలన్నారు. గెలవటానికి టిడిపి పోటీచేయటం లేదని, వైసీపీ అభ్యర్థిని ఓడించాలని కుమ్మక్కు రాజకీయాలకు తెరతీసారని ధ్వజమె త్తారు. రెండవ ప్రాధాన్యత విశయంలో ఇతరపార్టీలతో టిడిపి కమ్మక్కుఅయిందని మంత్రి అప్పలరాజు ఆరోపించారు. చంద్రబాబు ఎన్నికలు వస్తే నక్కజిత్తులు చేస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. జిల్లాలో పోలింగ్ ఉత్సాహంగా కొనసాగుతుందన్న మంత్రి.. వైసిపి శ్రేణులు ఒటర్లను ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు గ్రామాల నుంచి తరలిస్తున్నారని తెలిపారు. ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా పొదిలి పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుంది.

## ఆధారాల ధ్వంసంలో అవినాష్‌రెడ్డి పాత్ర: హైకోర్టుకు తెలిపిన సీబీఐ

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు లో తనపై సీబీఐ తీవ్రమైన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలంటూ కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. అవినాష్ విచారణకు సంబంధించిన వివరాలను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సీబీఐ అందించింది. 10 డాక్యుమెంట్లు, 35 మంది సాక్షుల వాంగ్మూలాలు, కొన్ని ఫొటోలను కోర్టుకు సమర్పించింది. అవినాష్ విచారణను ఆడియో, వీడియో ద్వారా రికార్డు చేస్తున్నట్లు కోర్టు దృష్టికి సీబీఐ తీసుకొచ్చింది. కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయడంలో అవినాష్ పాత్ర ఉందని.. ఆయనపై తీవ్ర చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు ఇవ్వొద్దని హైకోర్టును కోరింది. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పు వెల్లడించే వరకు అవినాష్‌ను అరెస్టు చేయొద్దని సీబీఐను ఆదేశిస్తూ తీర్పును రిజర్వ్ చేసింది. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పైనా ఉన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. భాస్కర్‌రెడ్డిని విచారణ అంశం హైకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. విచారణ హైదరాబాద్‌కు బదిలీ అయితే కడపకు ఎందుకు పిలిచారని ప్రశ్నించింది. కడపలో విచారణకు తాము పిలవలేదని సీబీఐ తెలిపింది. మరోవైపు సీబీఐ ఆఫీసు వద్ద అవినాష్ ప్రెస్‌మీట్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు జరుగుతుండగా ప్రెస్ మీట్ ఏంటని ప్రశ్నించింది.




# ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

అమరావతి: ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మూడు గ్రాడ్యుయేట్, 2 టీచర్, 4 స్థానిక సంస్థలకు ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ముగిసింది. 16న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఏలూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగుతోంది. మధ్యాహ్నం 12 గంటల వరకు 80.63% శాతం పోలింగ్ నమోదైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1105 ఓట్లు ఉండగా, అందులో పోలైనవి 891 ఓట్లు. పోలింగ్ శాతం 80.63% నమోదైంది. జంగారెడ్డిగూడెం లో మొత్తం ఓట్లు :184 ,పోలైన ఓట్లు:153 ,... 83.15% పోలింగ్ శాతం నమోదుకొవ్వూరులో మొత్తం ఓట్లు: 242, పోలైన ఓట్లు: 225,... 92.98 నపోలింగ్ శాతం నమోదునర్సాపురంలో మొత్తం ఓట్లు: 229 పోలైన ఓట్లు: 179,... 78.17 పోలింగ్ శాతం నమోదుఏలూరులో మొత్తం ఓట్లు :249, పోలైన ఓట్లు:153,.. 61.45 పోలింగ్ శాతం నమోదుభీమవరం లో మొత్తం ఓట్లు : 201 పోలైన ఓట్లు:181 .. 90.05 పోలింగ్ శాతం నమోదు తిరుపతి జిల్లా: నాయుడుపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లో పోలింగ్ సరళిని పరిశీలించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య. నెల్లూరు జిల్లా: కావలి జడ్పీ హైస్కూల్లో గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి. విశాఖ నగరంలోని మద్దిలపాలెం కృష్ణా డిగ్రీ కళాశాల, ఎవిఎన్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలని పరిశీలించిన విశాఖ సిపి శ్రీకాంత్. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్ ఓఒఅ ఓటు హక్కును



వినియోగించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి. అనంతపురం: ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉరవకొండ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా: భీమవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి వంకా రవీంద్ర నాథ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తిరుపతి జిల్లా: వెంకటగిరిలో ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్న నెల్లూరు జిల్లా గ్రంధాలయ సమస్త చైర్మన్ దొంతు శారద. ప్రకాశం జిల్లా: ఒంగోలు సెయింట్ థెరిసా స్కూల్ పోలింగ్ బూత్ వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహిళపై టీడీపీ కార్యకర్త దురుసుగా ప్రవర్తించాడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తిరగబడటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గుంపులు గుంపులు గా ఉన్న జనాన్ని పోలీసులు చెదర గొట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా: నల్లమాడ మండల కేంద్రంలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి దంపతులు గ్రాడ్యుయేట్ ఓఒఅ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# సంపాదకీయం

మంగళవారం 14-03-2023

## మరింత స్వతంత్రంగా ఈసీ...

ఎన్నికల కమిషన్ ఎంపిక ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు మరింతగా స్వతంత్ర ఎన్నికల కమిషన్ కి హామీనిస్తుంది. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర ఎంపిక కమిటీ ఏర్పాటు వల్ల ఈసీ ప్రస్తుత ఎంపిక పద్ధతిని సరిచేయడమే కాకుండా ఎంపిక ప్రక్రియకు పవిత్రతను జోడిస్తుంది.సుప్రీంకోర్టు తీర్పు, ఎంపిక ప్రక్రి యలో న్యాయబద్ధతకు హామీనివ్వడమే కాకుండా, భారత్ కల్లోల కాలాల్లో రాజ్యాంగ పాఠంగా వ్యవహరిస్తుంది. దేశంలో ఎన్నికల ప్రక్రియను ఘోరంగా దుర్వినియోగపరుస్తున్నట్లు తీర్పు గుర్తించింది. ఈసీ ఎంపిక ప్రక్రియపై సుప్రీంకోర్టు తాజా తీర్పు సాంప్రదాయిక ప్రజాస్వామ్యానికీ, రాజ్యాంగబద్ధ ప్రజాస్వా మ్యానికీ మధ్య ఉన్న చక్కటి వ్యత్యాసాన్ని గుర్తిస్తోంది. మొదటి రకం ప్రజాస్వామ్యంలో మెజారిటీకి మాత్రమే విలువ ఉంటుంది.రెండో రకం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. ఈ తీర్పు ద్వారా చాలాకాలం తర్వాత క్రియాశీల న్యాయ వ్యవస్థను దేశం చూసింది. న్యాయవ్యవస్థ క్రియాశీలత పునరుద్ధ రణ న్యాయపరమైన హేతువుకు కట్టుబడటమే కాకుండా, పూర్వ ప్రమాణాల మద్దతును కూడా కలిగి ఉంటుంది. గొప్పగా కన బడుతున్న కార్యనిర్వాహకవర్గంతో మెజారిటీతత్వపు అంధకార దశ సాగుతున్న కాలంలో ఈ తీర్పు వెలుగులోకి వచ్చింది. ఇది ఈ తీర్పుకు ఒక అంతర్గత విలువను జోడించింది. మనం తప్పుపట్టలేని విధంగా ప్రకటిద్దాం: దాదాపు ప్రతి రాజకీయ సమస్య కూడా న్యాయస్థానం పరిధిలోకి వస్తున్న సమయంలో దేశంలో రాజకీయ అధికారానికి సంబంధించి అత్యంత శక్తిమంతమైన కేంద్రంగా భారత సర్వోన్నత న్యాయస్థానం కొనసాగుతోంది. ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి, ఇతర కమిషనర్ల ఎంపిక కోసం తటస్థ విభాగం ఏర్పాటు అనేది అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వచ్చిన ప్రధాన ఉపశమనం. న్యాయవ్యవస్థ క్రియాశీలతా యుగాన్ని ఈ తీర్పు పునరుద్ధరించింది. గతంలో జరిగిన విధంగా కేంద్ర ప్రభుత్వంలో బలహీన సంకీర్ణంలోని తప్పులకు వ్యతిరేకంగా కాకుండా, బలవంతుడైన కార్యనిర్వాహకుడికి వ్యతిరేకంగా ఈసారి సుప్రీంకోర్టు వ్యవహరించింది. పిటిషనర్ల వాదంలోని ప్రధానాంశం ఏమిటంటే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(2) ప్రకారం సీఈసీ (ప్రధాన ఎన్నికల కమిషనర్), ఈసీ (ఎన్నికల కమిషనర్)ల ఎంపిక రాష్ట్రపతి ద్వారా జరుగుతున్నప్పటికీ, దానికి నిర్దిష్టంగా ప్రకటించిన చట్టం ప్రాతిపదికగా ఉండాలన్నదే. అయినప్పటికీ దీనికి సంబంధించి పార్లమెంటులో ఎలాంటి చట్టాన్నీ తీసుకురాలేదు. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని, సీఈసీ, ఈసీల ఎంపిక విషయంలో కేంద్రం మినహాయింపు పొందుతోంది. అధికారంలో ఉన్నవారికి, తమను ఎంపిక చేసుకున్న వారి అభిమతానికి అనుకూలంగా వ్యవహరించడం సీఈసీకి, ఈసీ సభ్యులకు పరిపాటిగా మారింది. అందువల్లే ప్యానెల్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని హామీ ఇచ్చేందుకు సీఈసీ, ఈసీల నియామకం విషయంలో స్వతంత్ర సంస్థను ఏర్పర్చాలని పిటిషనర్లు ఉన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. రాజ్యాంగ నియమంతో మరొక సమస్య కూడా ఉంది. ఆర్టికల్ 324(5) నియమం ప్రకారం, సీఈసీ తొలగింపునకు వ్యతిరేకంగా ప్రత్యేక రక్షణ కూడా ఉంటుంది. ఇతర ఈసీ సభ్యు లకు ఇలాంటి రక్షణను కల్పించలేదు. సుప్రీంకోర్టు న్యాయ మూర్తిని తొలగించే పద్ధతిలో మినహా, ఎన్నికల ప్రధాన కమిష నర్ తొలగించకూడదని ఈ నియమం పేర్కొంది. వాస్తవంగా దీని అర్థం ఏమిటంటే సీఈసీని పార్లమెంట్ అభిశంసించే మార్గం ద్వారా మాత్రమే తొలగించవచ్చు. ఇది కష్టమే కావచ్చు కానీ అసాధ్యమని చెప్పలేము. సీఈసీ నియామకం తర్వాత ఆయన సర్వీస్ నియమాలు తనకు అననుకూలతను తీసుకురాకూడదని ఈ నియమమే చెబుతోంది. పక్షపాతం లేదా, ఆశ్రిత పక్షపాతం ద్వారా సీఈసీ ఎంపికలో ఉల్లంఘన జరిగినప్పుడు సీఈసీకి మంజూరు చేసిన ఈ రక్షణ ఛత్రాన్ని నష్టపోవలసి ఉంటుంది. పైగా, సీఈసీ పదవీకాలంలో ఉండగా రక్షణ లేదా భద్రతను కోరుతున్నట్లయితే, సీఈసీపై ఇతర ఈసీ సభ్యులు మరింతగా అనుమానించవచ్చు. ఈ భయాందోళనలనే పిటిషనర్లు సుప్రీంకోర్టు ముందు వెలిబుచ్చారు. సీఈసీని ఎంపిక చేయడానికి ప్రధాన మంత్రి, లోక్‌సభలో అతిపెద్దపార్టీకి చెందిన ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌తో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పర్చడం అంటే నిలకడైన ప్రజాస్వామ్యం వైపు పెద్ద ముందంజగా భావించాలి. ఆర్టికల్ 342లోని ఖాళీ అనేది ప్రజాస్వామిక వాతావరణానికి చాలా అవసరం. అందుకే దానిపై ఎలాంటి ఉత్తరువు, సూచన ద్వారా ఆ ఖాళీని ఆక్రమించాలని రాజ్యాంగ సభ భావించలేదు. ఆ ఖాళీని భవిష్యత్ పార్లమెంటుకే వదిలేశారు. ప్రజాస్వామిక చట్టబద్ధతకి చెందిన గొప్ప లక్షణంతో ఈ సమస్యను ఎన్నికయ్యే పార్లమెంట్ చట్టబద్ధం చేస్తుందని భావించారు. పాలకపార్టీకి అనుకూలంగా కమిషన్‌ని పాక్షిక పునాదులపై నిర్వహించడమే. రాజ్యాంగ మౌనం ప్రయోజనకరమైనది, భావ నాత్మకమైనది, ప్రజాస్వామికమైనదిగా ఉండేది. అదే పార్లమెంటు విషయానికి వస్తే మార్మికంగా, దుస్సాహసికంగా, అప్రజాస్వామికంగా ఉండేది. అయితే మార్చి 2న వెలువరించిన తీర్పు ద్వారా ఉన్నత న్యాయస్థానం దీన్ని సరిచేసింది. సీఈసీ, ఈసీ క్రియాత్మక స్వయంప్రతిపత్తి వారు ఎంపికైన ప్రక్రియతో ప్రత్యక్ష అనుసంధానం కలిగి ఉంటుంది. ఎన్నికల రూపంలోని నిరంకుశత్వంలో అనేక విధాలుగా పోల్ ప్యానెల్‌పై కార్యనిర్వాహకవర్గానిదే పైచేయిగా ఉంటుంది. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా దాడికి గురయ్యే స్థితిలోని ఎన్నికల కమిషన్ ఒక కృత్రిమ పరిస్థితిలో కూరుకుపోయి, దాని సమర్థమైన పనితీరు నుంచి పక్కకు వెళుతుంది.

# వడివడిగా బందరు పోర్టు పనులు

విజయవాడ, మార్చి 13, బందరు పోర్ట్ పనులను త్వరలో ప్రారంభించేందుకు జగన్ సర్కార్ రెడీ అవుతుంది. ఉగాది తరువాత సీఎం జగన్ నేరుగా పనులను ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరం అయిన మౌళిక సదుపాయాలు పై ఎమ్మెల్యే పేర్ని నాని సమీక్ష నిర్వహించారు..బందరు పోర్ట్ కు మరో సారి శంఖుస్దాపన ఉండదని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. నేరుగా పనులను ప్రారంభం మాత్రమే ఉంటుందని, అది కూడా సీఎం జగన్ చేతులు మీదగానే ఆరంభం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బందరు పోర్ట్ నిర్మాణ పనులు పై అనేక దశాబ్దాలుగా సందిగ్దత కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రెండు సార్లు బందరు పోర్ట్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు శంఖుస్దాపన చేశారు. అయితే ఆనాటి పునాది రాళ్ళు కూడా కనుమరుగు అయిపోయాయి. పోర్ట్ నిర్మాణం జరిగితే దశాబ్దాలుగా కలలు కంటున్న స్దానికుల కల తీరుతుంది. కేంద్రం సహకారంతో అన్ని రకాల అనుమతులు తీసుకువచ్చి, నిర్మాణ పనులకు శంఖుస్దాపన కాకుండా, పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ బాలశౌరి చెబుతున్నారు. బందరు పోర్ట్ నిర్మాణం విషయంలో స్దానిక శాసన సభ్యుడు పేర్నినాని, పార్లమెంట్ సభ్యుడు బాలశౌరి మూట/ విభేదాలు ఇప్పటికే బహిర్గతం అయ్యాయి. ఈ కారణంతోనే బందరు పోర్ట్ పనుల ను నేరుగా ప్రారంభించేందుకు రావాల్సిన ముఖ్యమంత్రి షెడ్యూల్ కూడ వాయిదా పడిందనే ప్రచారం ఉంది. అయితే తాజాగా శాసన సభ్యుడు పేర్ని నాని పోర్ట్ పనులను ప్రారంభించేందుకు అవసరం అయిన మౌలిక సదుపాయాలు పై ఆరా తీశారు. స్దానికంగా పర్యటించి, వాహనాల రాకపోకలు, ముడి సరుకు రవాణాకు అవసరం అయిన మార్గాల ఏర్పాటు పై అధికారులతో చర్చించారు. దీంతో పోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఉగాది తరువాత ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఖరారు అవుతుందని చెబుతున్నారు. బందరు పోర్టు నిర్మాణానికి 5,253.88 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. ఇందులో 75 శాతం బ్యాంకు రుణం, 25 శాతం ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేయాలని గతంలోనే అంచనాకు వచ్చారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 75 శాతం రుణం ఇచ్చేందుకు కూడ ఆమోదం లభించింది. దీంతో క్యాబినేట్ సమావేశంలో రుణం తీసుకునే అంశం పై చర్చించారు. రుణం పొందేందుకు క్యాబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి 2 కిలోమీటర్ల 325 మీటర్ల దక్షిణం, ఉత్తరం బ్రేక్స్ వాటర్ గోడల నిర్మాణాలకు రూ.446 కోట్లు అవసరం అవుతాయని ఇప్పటికే అంచనాలు కూడ రూపొందించారు. ఉత్తరం వైపున 250 మీటర్ల కొండరాళ్లతో కాంక్రీట్ గోడ నిర్మాణానికి రూ. 10. 94 కోట్లు,

అలాగే దక్షిణం వైపున సదన్ బ్రేక్ వాటర్ రూ. 435 కోట్ల రూపాయలు వ్యయం అవుతుంది. డ్రెడ్జింగ్ కోసం మరో రూ.1242.88 కోట్లు, సముద్రం నుంచి ఓడలు రావడానికి అప్రోచ్ ఛానెల్ నిర్మాణానికి రూ. 706.26 కోట్లు, బ్రేక్ వాటర్ మధ్యలో ఓడలు తిరగడానికి టర్నింగ్ సర్కిల్, బెర్త్ పాకెట్స్ కోసం రూ.452.07 కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్ రెడీ చేశారు. బందరు పోర్టులో మొదటి విడతగా 4 బెర్తుల నిర్మాణం జరుగుతుందని.. మూడు బెర్తుల కోసం రూ.548 కోట్లు, బల్క్ కార్గో కోసం ఒక బెర్త్ .. దీనికి రూ.158 కోట్లు వ్యయం అవుతుందని ఇప్పటికే ఎమ్మెల్యే పేర్ని నాని తెలిపారు. ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే 80 వేల టన్నుల బరువుతో వచ్చే షిప్పులు సైతం సురక్షితంగా రాగలుగుతాయన్నారు. లక్ష నుంచి లక్షన్నర బరువుతో ఉండే షిప్పులు వచ్చే బెర్తులను సెకెండ్ ఫేజ్ లో నిర్మిస్తామన్నారు. అదేవిధంగా బందరు పోర్టు నిర్మాణానికి 1730 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు.మొదటి దశలో ఒక్క ఎకరం ప్రైవేట్ భూమి కూడా తీసుకోవడం లేదన్నారు.రైల్, రోడ్డు నిర్మాణానికి 235 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ)లను నిర్మించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

# మళ్లీ యాక్టివ్ అవుతున్న నల్లారి

విజయవాడ, మార్చి 13, కిరణ్ కుమార్ రెడ్డి.... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి..! రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సమైక్యాంధ్ర పార్టీని కూడా ప్రకటించారు. ఆ తర్వాత... సైలెన్స్ గా ఉండిపోయిన కిరణ్ కుమార్ రెడ్డి... తిరిగి హస్తం గూటికి చేరారు. ఈ మధ్యనే రాజకీయంగా యాక్టివ్ అవుతున్నట్లు వార్తలు వచ్చాయి. అన్నీ కుదిరితే ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా బాధ్యతలు తీసుకుంటారని జోరుగా చర్చ నడిచింది. సీన్ కట్ చేస్తే.... మరో కీలక నిర్ణయం తీసుకునే దిశగా కిరణ్ కుమార్ రెడ్డి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో అయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీ అగ్రనేతలతో కిరణ్ కుమార్ రెడ్డి చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. అన్నీ కుదిరితే మరికొద్ది రోజుల్లోనే బీజేపీ కండువా కప్పుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత... కమలం గూటికి చేరుతారని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. అయితే దీనిపై బీజేపీ లేదా కిరణ్ కుమార్ రెడ్డి నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాల్లో



కిరణ్ కుమార్ రెడ్డి... యాక్టివ్ రోల్ పోషించారు. హస్తం పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన పలు పదవులు కూడా చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గా పని చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో 2010 నవంబర్‌లో ముఖ్యమంత్రిగా కూడా సేవలు అందించారు. ఆ సమయంలో పాలనలోనూ తన మార్క్ ను చూపించారు. విభజనను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన కిరణ్ కుమార్ రెడ్డి... సమైక్యాంధ్రా పార్టీని స్థాపించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. ఇక కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు... నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి టీడీపీలో కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపును పీలేరు నుంచి పోటీచేసిన కిషోర్ కుమార్ రెడ్డి ఓడిపోయారు. 2024 ఎన్నికలకు కూడా సిద్ధమవుతున్నారు.

# వివేకా కేసులో ఏం జరుగుతోంది

కడప, మార్చి 13, ఏపీలో వైఎస్ అవినాష్ రెడ్డికి కూడా అధికార పార్టీ అండగా ఉంటోంది. వియ్ స్టాండ్ విత్ అవినాష్ రెడ్డి అని అందరూ మరోసారి నిలుస్తున్నారు. మరి ఈ కేసులో రాజకీయ కోణం ఉందా ? రాజకీయ కారణాలతో ఈ కేసులు పెట్టారా ? వైఎస్ కుటుంబంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్న ఈ కేసులో వైఎస్ఆర్‌సీపీ అవినాష్ రెడ్డికి మద్దతుగా నిలవడంతో అర్థం ఏమిటి?వైఎస్ వివేకానందరెడ్డి రెండో పెళ్లి, ఆ పెళ్లి ద్వారా ఓ కుమారుడు, ఆయన తన పేరును మహ్మద్ అక్బర్‌గా మార్చుకున్నారన్న విషయం.. ఆస్తుల కోసం హత్య జరిగిందన్న అంశాలను వివరించారు. తాను ఇప్పటివరకూ నోరు విప్పలేదని ఇక మొత్తం చెబుతానని ప్రకటించారు. ఆయన చెప్పిన దాంట్లో ఎన్ని నిజాలున్నాయి.. అవాస్తవాలున్నాయి.. అదే నిజం అయితే ఎందుకు సాక్ష్యాలు మాయం చేసే ప్రయత్నం చేశారు.. వంటి అనుమానాలను పక్కన పెడితే.. ఈ విషయాలను అవినాష్ రెడ్డి చెప్పిన వెంటనే సోషల్ మీడియాలో వైఎస్ఆర్‌సీపీ అవినాష్ రెడ్డికి మద్దతు క్యాంపెన్ ప్రారంభించింది. చివరికి వియ్ స్టాండ్ విత్ అవినాష్ రెడ్డి అనే డీపీని కూడా సోషల్ మీడియాలో పెట్టుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంను రాజకీయ వేధింపుల కేసుగా పరిగణించడానికి అవకాశం ఉంది. ఎందుకు పరిగణించాలో కూడా వారు కారణాలు చెబుతారు. అయితే అవినాష్ రెడ్డి ఎదుర్కొంటున్న కేసులు మాత్రం రాజకీయ వేధింపులు కాదు. స్వయంగా ఓ మాజీ ముఖ్యమంత్రి సోదరుడు.. ప్రస్తుత ముఖ్యమంత్రి బాబాయ్ అయిన వివేకానందరెడ్డి దారుణ హత్య. ఓ మనిషిని..అదీ వృద్ధుడ్ని ఇంత కిరాతకంగా హత్య చేసేవాళ్లు కూడా ఉంటారా అన్న పద్దతిలో ఈ హత్య జరిగింది. ఇప్పట్లో ఈ హత్యకు చంద్రబాబు కారణం అని ఆరోపించారు. తర్వాత తర్వాత అన్నీ పక్కకుపోయాయి. ఇప్పుడు వైఎస్ వినేకానందరెడ్డి కుమార్తె, అల్లుడే చంపించారని వాదిస్తున్నారు. ఎలా చూసినా ఇది పూర్తిగా కుటుంబంలోని సమస్య అవుతుంది. ఇప్పుడు సీబీఐ వేగంగా విచారణ జరపడం కానీ..ఇతర అంశాలు కానీ రాజకీయ జోక్యంతో సరి పోలనివి. కేసీఆర్ లాగా కేంద్రంపై యుద్ధం ప్రకటించి ఉంటే.. సీబీఐ కావాలే దూకుడుగా ఉందని ఆరోపించడానికి ఓ అవకాశం ఉండేది. కానీ కేంద్రంతో ఏ ప్రభుత్వమూ ఉండనంత సన్నిహితంగా ఉంటుంది. ఇలాంటప్పుడు వైఎస్ అవినాష్ రెడ్డికి అండగా ఉంటున్నట్లుగా ప్రచారం చేసుకోడం వల్ల వైసీపీకి లాభమా ? నష్టమా ? వైఎస్ వివేకా హత్య జరిగిన తర్వాత సాక్ష్యాలు తుడిచేయడం.. కేసు లేకుండా అంత్యక్రియలు పూర్తి చేయడం..

పోస్టు మార్టం కూడా చేయకుండా అన్ని లాంఛనాలు పూర్తి చేయాలని అనుకున్నారన్న వార్తలు వచ్చాయి. తర్వాత వైఎస్ సునీత పట్టుబట్టి పోస్టుమార్టం చేయించారు. ఆ తర్వాత తన తండ్రి హంతకులకు శిక్ష పడటానికి ఆమె పోరాటం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు సరిగ్గా దర్యాప్తు చేయడం లేదని సీబీఐ విచారణ కోసం కోర్టుకు వెళ్లారు. సాధించుకున్నారు. నిందితులకు శిక్ష పడాలని పోరాడుతున్నారు. విచారణలో వెల్లడవుతున్న విషయాలతో అవినాష్ రెడ్డి ఇబ్బంది పడతూంటే.. అవినాష్ రెడ్డి మాత్రం రివర్స్ లో సునీతపై ఆరోపణలు చేస్తున్నారు. అవినాష్ కు వైసీపీ మద్దతుగా ఉంటోంది. ఫలితంగా ఈ అంశంపై వైసీపీ వ్యూహాత్మక తప్పిదానికి పాల్పడుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అవినీతి కేసులకు.. హత్య కేసులకు తేడా ఉంటుంది. హత్య కేసుల్లో నిందితులకు వియ్ స్టాండ్ అంటే సపోర్ట్ చేస్తే ఆయా పార్టీలపై ప్రజల్లో వ్యతిరేక భావం పెరిగే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## టిడిపి నేత బీద రవిచంద్ర సీఐ రాములు నాయక్ మధ్య వాగ్వాదం

నెల్లూరు నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని రామ్మూర్తి నగర్ ప్రైమరీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రం వద్ద టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సీఐ రాములు నాయక్ మధ్య వాగ్వాదం జరిగింది. ఇక్కడ ఎందుకు ఉన్నారని వెళ్లిపోవాలని సిఐ నాయక్ పేర్కొనడంతో వాగ్వాదం మొదలైంది. తాము ఓటు వేసి కొన్ని టెక్నికల్ అంశాలకు సంబంధించి ఆగామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఓటు వేసిన వారు వెంటనే వెళ్ళిపోవాలని నాయక్ పేర్కొనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది...

## విజయనగరంలో పోలింగ్ ప్రశాంతం

విజయనగరం ??జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8-00 గంటలకు ప్రారంభమైన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. కలెక్టర్ సూర్యకుమారి జిల్లా కేంద్రంలోని కస్పా నగర పాలక ఉన్నత పాలక ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.. జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం పూట ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు.

# పాదయాత్రలు.. మైలురాళ్లు....

### కొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన లోకేష్



తిరుపతి, మార్చి 13, తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నరు. పాదయాత్ర గురువారం 39వ రోజు 500 కిలోమీటర్ల మైలు రాయి దాటింది. ఆ సందర్భంగా తాము అధికారంలో వచ్చిన వంద రోజుల్లో అన్నమయ్య జిల్లా సి టీ ఎం వద్ద టమాటో ప్రాసెసింగ్ యూనిట్ ను ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. గత డిసెంబర్ నెల 27వ తేదీ కుప్పంలో మొదలైన పాదయాత్ర చిత్తూరు, తిరుపతి జిల్లాల గుండా సాగి ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం మదనపల్లి నియోజకవర్గం లో ఆడుగుపెట్టిన యాత్ర 39వ రోజు కు చేరింది. వివిధ వర్గాల ప్రజలతో మమేకం అవుతున్న లోకేష్ ప్రతి వంద కిలోమీటర్ల యాత్ర పూర్తి అయిన సందర్భంగా స్థానికులకు ప్రత్యేక హామీలు ఇస్తున్నారు. పా ఎవరు పాదయాత్రలు చేసినా హామీలు ఖాయంగానేఇస్తూంటారు కానీ లోకేష్ మాత్రం హామీలను శిలాఫలకాలపై చెక్కించి తానే ఆవిష్కరిస్తున్నారు. యువగళం పాదయాత్ర 8వ రోజు న 100 కిలోమీటర్ల మైలు రాయి దాటినప్పుడు గత ఫిబ్రవరి 3వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాలెం వద్ద కిడ్నీ వ్యాధి గ్రస్తులకు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే యాత్ర 16వ రోజున 200 కిలోమీటర్లు ఆదిగమించినప్పుడు గంగాధర నెల్లూరు వద్ద డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ఫిబ్రవరి 11వ తేదీన హామీ ఇచ్చారు. తరువాత ఫిబ్రవరి 21వ తేదీన 23 వ రోజున యాత్ర 300 కిలోమీటర్లు దాటినప్పుడు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొండమానుపురం వద్ద 13 గ్రామాల దాహార్తి తీర్చే నీటి పథకాన్ని ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. ఆపై మార్చి 1వ తేదీన 32వ రోజు యాత్ర 400 కిలోమీటర్లు చేరినప్పుడు చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం నరేంద్ర పురం వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇక గురువారం యాత్ర 39వ రోజు అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గం సి టీ ఎం వద్ద 500 కిలోమీటర్ల మైలు రాయిని చేరుకుంది. ఆ సందర్భంగా సి టీ ఎం 2 వద్ద టమోటో ప్రాసెసింగ్ యూనిట్ ను ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ప్రతి వంద కిలోమీటర్లు పూర్తి అయిన చోట ఒక శిలాఫలాకాన్ని ఆవిష్కరించి తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామనే హామీలను ఇస్తున్నారు.పాదయాత్ర చేస్తున్న రాజకీయ నేతలకు ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడం సహజం. ప్రతిపక్షంలో ఉన్నందున ఇచ్చేది హామీలే కాహట్టి నేతలంతా తాము అధికారలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇస్తారు.అయితే అవి సాధ్యమవుతాయా లేదా అన్నది పట్టించుకోలేదు. ప్రస్తుత సీఎం జగన్ పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చారని వాటిని పట్టించుకోవడం లేదని టీడీపీ నేతలు ఆరోపిస్తూ ఉంటారు. వివిధ సంఘాలు ఆందోళనలు చేసినప్పుడు సీఎం జగన్ తమకు పాదయాత్రలో హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపమలు చేస్తూ ఉంటాయి. తాజాగా అగ్రిగోల్డ్ బాధితులు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. అయితే మేనిఫెస్టోను మాత్రమే వైఎస్ఆర్సీపీ ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉంటుంది. మొత్తం హామీలను నెరవేర్చామని చెబుతూ ఉంటుంది. కానీ పాదయాత్రలో ఇచ్చిన హామీ సంగతేమిటని ఎక్కువ మంది ప్రశ్నిస్తారు. తాను అలా చేయనని చెప్పేందుకు లోకేష్ శిలాఫలాకాలను చెక్కిస్తున్నట్లుగా తెలుస్తోంది.

నారా లోకేష్ వ్యూహాత్మకంగానే శిలాఫలకాలను ఏర్పాటు చేస్తున్నట్లుగా భావిస్తున్నారు. సుదీర్ఘంగా ఆ సమస్యల కోసం ప్రజలు పోరాడుతున్నారు. నిజానికి ఆ సమస్యలు పరిష్కారం అయితే ప్రజల ఆదాయం కూడా పెరుగుతుంది. రైతుల సమస్యలు తీరుతాయి. లోకేష్ ఆయా ప్రాంతా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే హామీలనే ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో ఖచ్చితంగా చేయగలిగే హామీలనే ఇస్తున్నారు. శిలాఫలకాలపై పెడుతున్నారని టీడీపీ నేతలంటున్నారు. ప్రజల కోరిక మేరకు ఇస్తున్న హామీలను ప్రభుత్వం ఇప్పుడే నెరవేరిస్తే.. క్రెడిట్ కూడా లోకేష్ కు వస్తుందని.. నేరవేర్చకపోతే.. లోకేష్ నెరవేరుస్తాడనే భరోసా ఉంటుందని టీడీపీ నేతలంటున్నారు.

# భారీగా తగ్గిన రబీ సాగు

కాకినాడ, మార్చి 13,ఈ తడవ రబీ సాగు విస్తీర్ణం బాగా పడిపోయింది. సీజన్ సాధారణ సాగులో పది లక్షల ఎకరాలకుపైన బీడు పడింది. ఖరీఫ్‌లో వర్షాభావం, తుపాన్లు, వరదల వలన సేద్యం తగ్గడం కద్దు. ఆ లోటు రబీలో భర్తీ అవుతుంది. కానీ ఎన్నడూ లేని విధంగా ఈ మారు రబీలో లక్షలాది ఎకరాలు సాగు లేక ఖాళీ పడ్డాయి. రబీలో ఆహార ధాన్యాల సాగు ఎక్కువ. అందులోనూ వరి, పప్పుధాన్యాలు అధికంగా సాగు చేస్తారు. ఈ సారి ఆ పంటలు పది లక్షల ఎకరాల్లో సాగు కాలేదు. ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు బానే ఉన్నాయి. భూగర్భ జలాలకు కొరత లేదు. అయినప్పటికీ రబీ సాగు భారీగా తగ్గడానికి పంటలకు గిట్టుబాటు ధరలు లేమి, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు, పెట్రోలు, డీజిల్ ఛార్జీలు, కల్తీ, నకిలీ విత్తనాలు, ప్రకృతి విపత్తులు, వరి సాగుపై ప్రభుత్వ ఆంక్షలు, రైతులకు సర్కారు నుంచి అంతగా లభించని తోడ్పాటు... ఇత్యాది కారణాల వలన రబీ సాగు తగ్గిందని, రైతులు అనాసక్తి చూపారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.రబీ ప్రారంభం నుంచీ సాగు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా నడిచింది. మామూలుగా ఫిబ్రవరి చివరాఖరుకి సీజన్ ముగుస్తుంది. మార్చిలో నీటి వనరులున్న ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తారు మార్చి 9 నాటికి మొక్కజొన్న, కుసుమలు, పొద్దుతిరుగుడు వంటి చిన్న చితకా పంటలు తప్ప తతిమ్మావన్నీ ఈ సారి తగ్గాయి. రబీలో 58 లక్షల ఎకరాల్లో పంటల సాగును ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. సీజన్ నార్మల్ 57.30 లక్షల ఎకరాలు. ఇప్పటికి 46.52 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. దాదాపు 10.78 లక్షల ఎకరాల్లో (19 శాతం) సాగు లేదు. గతేడాది కంటే సుమారు 6.95 లక్షల ఎకరాల్లో సేద్యం తగ్గింది.ఆహార ధాన్యాలు 10.05 లక్షల ఎకరాల్లో (19 శాతం) తగ్గాయి. వరి 17 శాతం, ముతక ధాన్యాలు 7 శాతం, పప్పుధాన్యాలు 25 శాతం తగ్గాయి. ముతక ధాన్యాల్లో మొక్కజొన్న మాత్రం నార్మల్‌కు మించి 18 శాతం ఎక్కువ సాగైంది. సజ్జ, రాగి, చిరుధాన్యాలు తక్కువ సాగయ్యాయి. రబీలో వరికి సమానంగా పప్పుధాన్యాలు సాగు చేస్తారు. కాగా ఈ మారు వాటి సాగు పడిపోయింది. పప్పుల్లో ఎక్కువ సాగు చేసే శనగ సైతం ఈ సారి తగ్గింది.

## మళ్లీ 16న ఉద్యోగ సంఘాలతో భేటీ

గుంటూరు, మార్చి 13,ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం నిర్వహించిన చర్చలపై ప్రభుత్వం ఒక స్పష్టతనిచ్చింది. చర్చల సారాంశాన్ని, అంగీకరించిన అంశాలను రాతపూర్వకంగా ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేయడంతో తాజాగా ప్రభుత్వం అధికారికంగా తన నిర్ణయాలను ప్రకటించింది. ఇందులో కొన్ని అంశాలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామన్న దానిపైనా వివరణ ఇచ్చింది. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, మెడికల్ అలవెన్సులు, ఇతర అరశాలతోపాటు 12వ పిఆర్‌సి, డిఎ వంటివాటిపైనా స్పష్టత ఇచ్చింది. కొద్ది రోజుల క్రితం జరిగిన సమావేశంలో చెప్పినట్లుగానే ఈ నెలాఖరునాటికి జిపిఎఫ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెరట్, హెల్త్ స్కీమ్ నిధులు, బీమా, టిఎ వంటివి చెల్లించనున్నట్లు, దీనికి సుమారు రూ.3 వేలకోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఆర్జిత సెలవులు, పింఛనుదారులకు గ్రాట్యూటీ కూడా నెలాఖరులోగా ఇవ్వనున్నట్లు ప్రకటించిరది. మరికొన్ని అంశాలను సెప్టెంబరులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొంది. 2018 జులై ఒకటి, 2019 జనవరి ఒకటికి సంబంధించిన డిఎ బకాయిలను, ఆర్జిత సెలవులను రెరడు విడతలుగా చెల్లిరచనున్నట్లు పేర్కొంది. ప్రతియేటా సొంత ఆదాయం రూ.1.25 లక్షల కోట్లు వస్తురడగా, అందులో రూ.90 వేల కోట్ల వరకు ఉద్యోగుల జీతాలు, పిరఛన్లకు చెల్లిస్తున్నట్లు వివరించిరది. అయినప్పటికీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొంది. 12వ వేతన సవరణ, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాలపై ఈ నెల 16న మరోసారి ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ కానున్నట్లు వివరించిరది. అన్ని అంశాలపై ప్రతినెలా తొలి, రెండో సోమవారాల్లో ఉద్యోగులతో చర్చించాలని అన్ని శాఖలకూ ఆదేశాలు జారీ చేశారు. సిఎస్ స్థాయిలో కూడా నెలకోసారి సమావేశం నిర్వహిరచనున్నారు. గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నురచి 62 ఏళ్లకు పెంచే విషయం కోర్టులో ఉరదని, తరువాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. ఇక ప్రభుత్వ నిర్ణయాలను అధ్యయనం చేసిన అనంతరం ఉద్యోగ సంఘాలు ఎలాంటి ఉద్యమ విధానాలు అవలంభిస్తాయో చూడాల్సి ఉంది.


## అనర్హులు ఓట్లు వేస్తున్నారు

తాడేపల్లి ఎమ్మెల్సీ ఎన్నికలపై టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా పరిశీలించారు. పోలింగ్ లో అక్రమాలు, వైసీపీ దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులను అధినేతకు పార్టీ నేతలు వివరించారు. వివిధ ఘటనలపై కడప ఎస్పీ, తిరుపతి జిల్లా ఎస్పీ, కలెక్టర్లతో ఫోన్ లో టీడీపీ అధినేత మాట్లాడారు. ఉదయం నుంచి జరిగిన ఘటనలు అధికారులకు వివరించి తక్షణ చర్యలు డిమాండ్ చేసారు. చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికలు ఇంత స్థాయిలో అపహాస్యం అవుతుంటే అధికారులు చర్యలు దిగకపోవడం దారుణమని అన్నారు. బస్సుల్లో, ప్రత్యేక వాహనాల్లో ఇతర రాష్ట్రాలనుంచి ప్రజలను తరలించి దొంగ ఓట్లు వేయిస్తున్నా యంత్రాంగం మౌనంగా ఉంది. పట్టభద్రులు ఓటువేయాల్సిన ఎన్నికల్లో అనర్హులతో, నిరక్షరాస్యులతో బోగస్ ఓట్లు వేయిస్తున్నారు. రాజకీయ పక్షాల ఫిర్యాదులను ఎన్నికల అధికారులు సీరియస్ గా తీసుకోవాలి. తిరుపతి లో బోగస్ ఓట్లపై అభ్యంతరాలు తెలిపిన టీడీపీ నేతలను అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో టీడీడీ ముఖ్యనేతలు యనమల, నక్కా ఆనంద్ బాబు, కొల్లు రవీంద్ర, బోండా ఉమ, టీడీ జనార్ధన్ తదితర నేతలు పాల్గొన్నారు.

## జనసేన తీర్థం పుచ్చుకున్న ఈదర హరిబాబు, టీవీ రామారావు

అమరావతి మార్చ్ 13 ;ఒంగోలు మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఇద్దరూ పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పలువురు ద్వితియ శ్రేణి నాయకులు కూడా జనసేన కండువా కప్పుకున్నారు. ఈదర హరిబాబు సీనియర్ నేత. తెలుగుదేశం స్థాపించిన తర్వాత పార్టీలో చేరి సుదీర్ఘకాలం పార్టీ కోసం అహర్నిశలు కృషిచేశారు. 1994లో ఒంగోలు నుంచి టీడీపీ తరఫున పోటీచేసిన ఆయన 19వేల 879 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2014లో ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమైన ఈదర.. ఇప్పుడు మళ్లీ అభిమానులు, కార్యకర్తలు, అనుచరుల కోసం క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలని భావించి.. జనసేన తీర్థం పుచ్చుకున్నారు. హరిబాబు చేరికతో నియోజకవర్గంలో జనసేనకు మంచిరోజులు వచ్చినట్లేనని.. పార్టీ మరింత బలోపేతం అవుతుందని కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో ఈయన ఎమ్మెల్యే టికెట్‌ఇస్తానని పవన్ హామీ కూడా ఇచ్చారని విశ్వసనీయ వర్గాల సమాచారం. జగన్ పట్టించుకోకపోవడంతో..!ఇక టీవీ రామారావు విషయానికొస్తే..తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో ఓ వెలుగు వెలిగారీయన. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన రామారావు గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఆశించారు కానీ అధిష్టానం కనికరించలేదు. మళ్లీ 2019 ఎన్నికల్లో అయినా సీటు దక్కుతుందేమో అని ఆశపడ్డారు కానీ.. అవన్నీ అడియాసలే అయ్యాయి. టీడీపీ అధిష్టానంపై ఆగ్రహంతో ఇక సైకిల్‌కు టాటా చెప్పేసి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో తానేటి వనితను (ప్రస్తుతం జగన్ కేబినెట్‌లో హోం మంత్రి) గెలిపించుకుని వస్తే ఆశించిన పదవి ఇస్తానని మాటిచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అస్సలు పట్టించుకోలేదట. అధికార పార్టీలో కొందరికే పదవులు కట్టబెడుతున్నారని.. తీవ్ర అసంతృప్తికి లోనైన టీవీ రామారావు ఇటీవలే వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. అభిమానులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన.. జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం నాడు పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అయితే టీడీపీ, వైసీపీలో జరిగిన అన్యాయం గురించి పవన్‌కు చెప్పడంతో రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారని.. ఆ తర్వాతే రామారావు జనసేన తీర్థం పుచ్చుకున్నారని టాక్ నడుస్తోంది. ఈయన రాకతో కొవ్వూరులో జనసేన బలోపేతం అవుతుందని అధిష్టానం భావిస్తోంది.మొత్తానికి చూస్తే.. జనసేనలో కూడా చేరికలు ఊపందుకుంటున్నాయి. ఈ చేరికలతో అటు వైసీపీ పెద్దలు.. ఇటు టీడీపీ పెద్దలు ఇలా జరిగిందేంటి..? అని ఆలోచనలో పడ్డారట. రానున్న రోజుల్లో టీడీపీ, వైసీపీ నుంచి టికెట్లు రావనుకునే సిట్టింగ్‌లు, మాజీలు కూడా తమ పార్టీలో చేరతారని అధిష్టానం ధీమాతో ఉందని తెలుస్తోంది. నాయకులు రావడం ఓకే.. కండువాలు కప్పడమూ ఓకే మరి వారికి ఏ మాత్రం ప్రాధాన్యత ఉంటుంది..? టికెట్లు ఇచ్చే పరిస్థితి ఉంటుందనే అసలు పాయింట్. రానున్న ఎన్నికల్లో పార్టీలో చేరిన వారికి జనసేన ఏ మాత్రం టికెట్ ఇస్తుందో వేచి చూడాల్సిందే మరి.

## ఉగాది తర్వాత రఘువీరా సెకండ్ ఇన్నింగ్స్...



అనంతపురం, మార్చి 13, కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలను దశాబ్దాలపాటు శాసించింది. ఆ ప్రయాణంలో ఎంతోమంది నాయకులు వచ్చారు.. వెళ్లారు. వారిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లీడర్స్‌లో ఎన్. రఘువీరారెడ్డి కూడా ఒకరు. పీసీసీ మాజీ చీఫ్. రాష్ట్ర విభజన సమయంలో సీఎం పదవికి ఆయన పేరును కూడా కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలించింది. మంత్రిగానూ సుదీర్ఘకాలం పనిచేశారు. కానీ రాష్ట్ర విభజన తర్వాత రఘువీరారెడ్డి రాజకీయ ప్రయాణం సాఫీగా సాగలేదు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయన కూడా సైలెంట్ అయ్యారు. ప్రతికూల రాజకీయ వాతావరణంలోనూ కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు మోసినా.. 2019 ఎన్నికల తర్వాత పొలిటికల్ స్క్రీన్ నుంచి ఆయన తప్పుకొన్నారు. రాజకీయాలకు దూరం అయ్యారు. పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసి తన సొంతూరు మడకశిర మండలంలోని నీలకంఠాపురానికే పరిమితం అయ్యారు.నిత్యం ఖద్దర్ బట్టలు వేసుకొని.. రాజకీయాల్లో బిజీబిజీగా గడిపిన రఘువీరారెడ్డి తన స్వగ్రామంలో ఒక ఆధ్యాత్మిక వాతావరణానికి పరిమితమయ్యారు. గ్రామంలో నీలకంఠేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ప్రజల కోసం ఒక కంటి ఆసుపత్రిని కూడా తీసుకొచ్చారు. ఇక ఈ నాలుగేళ్లలో ఊర్లో ఎప్పుడు తన పాత మిత్రులతో కలిసి తిరగడం.. రచ్చబండ మీద చర్చలు చేయడం.. పిల్లలతో ఆటలు.. పాటలు.. ఈతకొట్టడం ఇలా జీవనం సాగుతోంది. పొలాల్లో కలుపు తీశారు.. నెత్తిన గడ్డిమోపు మోశారు. ఎలాంటి భద్రత లేకుండా మోపెడ్‌పై భార్యను కూర్చోబెట్టుకుని బయటకెళ్లేవారు. రాజకీయల గురించి రఘువీరారెడ్డి మాట్లాడి నాలుగేళ్లు అయ్యింది. పాలిటిక్స్‌పై ఎవరు ఏం ప్రశ్నించినా ఆయన నుంచి మౌనమే సమాధానంగా ఉండేది.రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఏపీలోకి ఎంట్రీ ఇచ్చిన సమయంలో రఘువీరారెడ్డి వెళ్లి.. పార్టీ అగ్రనేతను కలిసి వచ్చారు. తన ప్రాంతం నుంచి జనాన్ని కూడా తీసుకెళ్లి రాహుల్‌గాంధీకి స్వాగతం పలికారు. అప్పుడే రఘువీరారెడ్డి మళ్లీ రాజకీయంగా యాక్టివేట్ అవుతున్నారనే చర్చ సాగింది. ఆయన మాత్రం తనకు గాంధీ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే పాదయాత్రకు వెళ్లానని స్పష్టంగా చెప్పారు. ఇంతలో రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన పార్టీ ప్లీనరీలో తళుక్కుమన్నారు రఘువీరారెడ్డి. వ్యవసాయంతోపాటు ఇరిగేషన్ అంశాలపై వేసిన ప్లీనరీ కమిటీ పగ్గాలు ఆయన చేపట్టారు. ప్లీనరీకి వెళ్లేం వచ్చాం అన్నట్టు కాకుండా? అక్కడ కీలక పాత్ర పోషించడంతో.. రఘువీరారెడ్డి వనవాసం వీడినట్టేనని చర్చ మొదలైంది.ఇక రాజకీయాలపై స్పందించాల్సింది రఘువీరారెడ్డే. ప్రస్తుతం ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఆశాజనకంగా లేదు. మరి.. రఘువీరారెడ్డి ఏం చేస్తారు అన్నది ప్రశ్న. ఏ నిర్ణయమైనా ఆయన ఉగాది తర్వాతే ప్రకటిస్తారని తాజా చర్చ. దాంతో ఉగాది తర్వాత ఆయన ఏం చెబుతారు? ఇన్నాళ్లూ మెరిసిన గడ్డంతో.. ఫక్తు రైతుగా మారిన రఘువీరారెడ్డి.. ఇకపై మళ్లీ పాత కాంగ్రెస్ నేతలా ప్రజలకు కనిపిస్తారా? యాక్టివ్ పాలిటిక్స్‌పై కాంగ్రెస్ హైకమాండ్ ఆయనకు ఏదైనా సలహా ఇచ్చిందా? దానికి ఈ మాజీ మంత్రి ఏం సమాధానం చెప్పారు? రాజకీయాల్లో తిరిగి చురుకైన పాత్ర పోషిస్తే.. వచ్చే అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల్లో దేనికి పోటీ చేస్తారు అనేది ఉత్కంఠే..! ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ఉగాది వరకు ఆగాల్సిందే.

## చేనేత రంగానికి పునర్వైభవం

నెల్లూరు, మార్చి 13,చేనేత రంగం పూర్వవైభవం సంతరించుకుంటోంది. స్వదేశీ నినాదం ఊపందుకోవడంతో దేశవ్యాప్తంగా చేనేతకు క్రేజ్ పెరుగుతోంది. ప్రతి భారతీయుడు కొనుగోలు చేసే దుప్పట్లు, టవల్స్, కర్టెన్లు, గలీబులు, చీరలు, ప్యాంట్లు, షర్టులు వంటి వస్త్రాల్లో కనీసం 15 నుంచి 20 శాతం చేనేత కార్మికులు తయారు చేసినవి వాడగలిగితే.. ఆ రంగానికి ఊతమిచ్చినట్టేననే బలమైన నినాదం ప్రజల్లోకి వెళ్లింది.మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం నిరంతరం జీవించగలిగేలా చేనేత రంగానికి ఊతమిచ్చే చర్యలు ఇటీవల దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్నాయి. చేనేత రంగానికి ఊతమిచ్చే అనేక చర్యలు చేపట్టింది. ఫలితంగా దేశవ్యాప్తంగా తెలుగు చేనేత కార్మికులు మార్కెట్‌లో పోటీ పడుతున్నారు. చేనేత పేరు పలకగానే.. పట్టుపావడా కుచ్చిళ్లు కాళ్లకు అడ్డం పడుతున్నా పరుగులు ఆపని పకపక నవ్వుల పాపాయి గుర్తు రాకుండా ఎలా ఉంటుంది. ఐలారం.. చీరాల పేరాల సుతిమెత్తని చీరల్లో అమ్మ మడతపెట్టి తెచ్చిన పుట్టింటి జ్ఞాపకాలు ఎలా మరిచిపోగలం. చేనేత మాటెత్తగానే.. వెంకటగిరి జరీ వెలుగులు.. మంగళగిరి ఫ్యాన్సీ జిలుగులు.. ఉప్పాడ.. ధర్మవరం పట్టుచీరలు, పావడాలు.. పొందూరు ఖద్దరు.. పెడన కలంకారీ అద్దకాలు.. గూడవల్లి చావిట్లో మగ్గం చప్పుళ్లు.. రాజోలు, అంబాజీపేట వాకిళ్లలో గంగాళాల్లో నానబోసిన రంగురంగుల దారాల కండెలు.. ఇంటిముందు రంగులద్దిన తడి నూలు ఆరబోతలు.. పడుగు?పేకల కలబోతతో నాజూకు కలనేత కళ్లముందు ఇట్టే కదలాడుతాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో చేనేత కేంద్రాలు అనేక ప్రత్యేకతలు సంతరించుకున్నాయి. ఒక్కో చోట ఒక్కోతరహా అద్భుతమైన నేతతో ఆకట్టుకుంటున్నాయి.

పెడన, మచిలీపట్నంలలో సహజసిద్ధంగా తయారు చేసిన రంగులతో కాంతులీనే అద్దకం వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. స్థానికంగా ఉండే చెట్లు, పువ్వుల నుంచి రంగుల సారం, బంక మన్ను, నదులలోని ఇసుక నుంచి రసాయనాలు తయారు చేసి వాటిని వస్త్రాలకు బ్లాక్ ప్రింట్స్‌తో అద్దకం చేసే మన కళాకారులు అనేక అవార్డులను సైతం దక్కించుకున్నారు.

వెంకటగిరి జరీ, మంగళగిరి ఫ్యాన్సీ, పట్టు చీరలు, కాటన్ వస్త్రాలు, పెడన కలంకారీ అద్దకాలు, పొందూరు ఖద్దరు వంటి అనేక ప్రత్యేకతలు మన రాష్ట్రంలోని చేనేత కళాకారుల సొంతం.

శ్రీకాళహస్తిలో హ్యాండ్ ప్రింట్స్ (చేత్తో గీసే డిజైన్లు) ప్రత్యేకం. వారి కళా నైపుణ్యానికి జాతీయ అవార్డులు సైతం దక్కాయి.

ఉప్పాడ జాందానీ జరీ చీరలు, ధర్మవరం కాటన్, పట్టు చీరలకు ప్రత్యేకం. బ్లాక్?ప్రింట్స్(కలంకారీ) చేనేతలో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి ఘనమైనది.

భారతదేశంలో దాదాపు 150 చేనేత ఉత్పత్తి కేంద్రాలు ఉన్నట్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మైసూరు, ఒడిశా,బిహార్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, సూరత్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లోని అనేక చేనేత కేంద్రాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకమైన నేత ప్రత్యేకం. ఇక్కత్, జాందానీ, పట్టు, జరీ చీరలు టై?డై కలంకారీ, పుల్కారి, ఢకై, బాలుచరి సిల్క్, మూగా సిల్క్, పటోల డిజైన్, చందేరి సిల్క్, పైథాని సిల్క్, కోటా పేపర్ సిల్క్, టసర్ సిల్క్, ఖాదీ సిల్క్, మైసూరు సిల్క్, కాశ్మీర్ సిల్క్, ఎరిముడి సిల్క్, కాశ్మీర్ పష్మినా, శాహ్తూష్ పల్చని ఉన్ని వంటి ఉత్పత్తులకు నిరంతరం డిమాండ్ ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాల గిరిజన జాతులు రకరకాల చిహ్నాల రంగుల వస్త్రాలు, బిహార్ మధుబని, మహారాష్ట్ర వర్లి డిజైన్లతోపాటు ఆయా రాష్ట్రాల సంప్రదాయ దుస్తులకు చేనేత ఊతమిస్తోంది. నిత్య నూతనమైన డిజైన్లతో చేనేత సంప్రదాయం కొత్త పుంతలు తొక్కుతోంది. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను బట్టి.. మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా చేనేత కళాకారులు నైపుణ్యాలను పెంచుకుంటూ పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకుంటున్నారు. భారతీయ చేనేతకు ప్రపంచవ్యాప్తంగా ఘన చరిత్రే ఉంది. పురాతన కాలం నుంచీ భారతీయ చేనేత వస్త్రాలు ప్రపంచమంతా ఎగుమతి అయ్యేవి. సుమారు 2 వేల్ల ఏళ్ల క్రితం 'హంస' డిజైన్లతో కూడిన భారతీయ వస్త్రాలు ఈజిప్టులోని కైరో నగరంలో లభ్యమయ్యాయి.అగ్గిపెట్టెలో పట్టే మస్లిన్ చీరలను నేసిన ఘనత కూడా భారతీయులదే. 1905 ఆగస్టు 7న కోల్‌కతాలో స్వదేశీ ఉద్యమం ప్రారంభం కాగా.. విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చిన స్వాతంత్ర్య ఉద్యమకారులు చేనేత తదితర స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారు. దేశంలో కుటీర పరిశ్రమగా భాసిల్లుతున్న చేనేత రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 70 లక్షల మందికి పైగా ఆధారపడి జీవిస్తున్నట్టు అంచునా. ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న చేనేత ఉత్పత్తుల్లో 90 శాతం మన దేశానికి చెందినవే కావడం విశేషం.

## టెన్త్ చదివినా...గ్రాడ్యేయేషన్ పోలింగ్ లో ఓటు

తిరుపతి, మార్చి 13,ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని విపక్షాలు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే కొన్ని రుజువులను కూడా మీడియా ముందుకు తీసుకొచ్చారు నేతలు. ఇప్పుడు అవన్నీ నిజమనేలా తిరుపతిలో ఓ ఘటన జరిగింది. పదో తరగతి ఫెయిల్ అయిన ఓ మహిళ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు రావడం కలకలం సృష్టిస్తోంది. తిరుపతి ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓటర్లు వెలుగులోకి వస్తున్నారు. 10వ తరగతి ఫెయిలైన మహిళ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేశారు. డిగ్రీ లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేశారు. ఆమెతో మీడియా మాట్లాడితే.. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తినని చెప్పుకొచ్చారు. తాను పదోతరగతి ఫెయిల్ అయ్యాయని వివరించారు. తమిళనాడుకు చెందిన మహిళ తన పేరు విజయ అని చెప్పుకుంటున్నారు. తనకు తమ ప్రాంత వాలంటీర్ వచ్చి ఓటర్ స్లిప్ ఇచ్చారని అందుకే ఓటు వేసేందుకు వచ్చినట్టు పేర్కొన్నారు. అంతకు మించి తనకు ఏమీ తెలియదని అంటున్నారు. ఆమె దొంగ ఓటు వేసిందని అక్కడే ఉన్న నాయకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన వాళ్లు లైట్ తీసుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. తిరుపతిలోని సంజయ్‌గాంధీ కాలనీ 228 పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దొంగ ఓటర్లను పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్తున్నరాని టీడీపీ నాయకులు ధర్నా చేశారు. వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరు పార్టీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రంగ ప్రవేశం చేసిన పోలీసులు టీడీపీ లీడర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సదుంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు క్యూలో నిల్చున్నారు. ఇక్కడ పట్టభద్రులు 9036, ఉపాధ్యాయులు 529 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పూతలపట్టు మండల కేంద్రం జడ్పీ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నిక నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు పోలీసులు. సాయంకాలం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. తిరుపతిలోని సత్యనారాయణ పురం పోలింగ్ స్టేషన్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఓటు లేకున్నా వైసీపీ నాయకులను పోలింగ్ కేంద్రంలోకి పంపిస్తున్నారంటు ప్రశ్నించినందుకు ఆయన్ని అరెస్టు చేశారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. అన్నమయ్య జిల్లాలో పట్టభద్రుల కోసం 51 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 30 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3890 మంది ఓటర్లు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 44432 మంది ఓటర్లు ఓటు వేస్తారు. జిల్లాలో 51 గ్రాడ్యుయేట్, 30 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు. కడప జిల్లాలో పట్టభద్రుల కోసం 98 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 38 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 7461 మంది ఓటు హక్కు వినియోగించుకొనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 81317 మంది ఓటు వినియోగించుకొనున్నారు. 93 గ్రాడ్యుయేట్, 38 టీచర్స్ పోలింగ్ కేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 27 మంది ఇన్స్‌పెక్టర్లు, 73 మంది ఎస్‌ఐలు, 1200 మందికిపైగా పోలీసులను బందోబస్తులో ఉన్నారు. గాంధీ నగర్ పోలింగ్ స్టేషన్‌లో 22వ బూతులో వైసిపి టిడిపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

## నకిలీ ఓటర్ గుట్టు రట్టు

తిరుపతి సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు తిరుపతి జీవకోన ఏరియాలో బూత్ నెంబర్ 233, 234 లో ఓటు వేయడానికి వెళ్తున్న నకిలీ ఓటరు ఒకరు కెమెరాకు చిక్కారు. ఓటర్లను ప్రశ్నించినప్పుడు 10వ తరగతి చదువుకున్నానని ఓటరు చెప్పిన విషయం వీడియోలో స్పష్టంగా నమోదైంది. ఈ ఘటనతో అధికార పార్టీ నకిలీ ఓటర్లను చేర్పించినట్లు స్పష్టంగా రుజువైందని సిపిఎం నేత వి శ్రీనివాస్ రావు ఆరోపించారు. కాబట్టి ఇప్పటికైనా నకిలీ ఓటర్లు ఓటు వేయకుండా అడ్డుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ని సిపిఎం కోరుతున్నదని అయన అన్నారు.

## మార్చి 21న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మార్చి 13తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 22వ తేదీన ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకొని మార్చి 21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 6 నుండి 11 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుభ్రం చేస్తారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేస్తారు. శుద్ధి పూర్తి అయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## నందిగామలో టీడీపీ నిరసన

నందిగామనందిగామ గాంధీ సెంటర్ లో నందిగామ జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ తాతయ్య తదితరులు వినూత్న రీతిలో నిరసన తెలియజేసారు. జగనన్న ధాన్యం డబ్బులు జగనన్న ధాన్యం డబ్బులు అని రైతులు నినాదాలు చేసారు. రైతులకు ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని సెంటర్ లో కూర్చుని భిక్షాటన చేసారు. నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గలలో రైతులకు ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని ఆర్డీవో రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతాంగం పరిస్థితి పూర్తిగా అంధకారంగా మారింది.వరి రైతులు కష్టం ఎవరు చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఎవరు కూడా వారి బాధను అర్థం చేసుకోవడం లేదు ఈ ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వం గా వ్యవహరిస్తుందని ధాన్యం పులిహోర చేసి మూడు నెలలు అవుతున్నా కూడా రైతులకు బకాయిలు చెల్లించలేదని రాష్ట్రవ్యాప్తంగా 1500 కోట్లు కృష్ణా జిల్లా వ్యాప్తంగా 80 కోట్లు కొత్త టార్గెట్ 15000 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం ఇచ్చిందని మూడు నెలల నుంచి చెప్తున్నారు కానీ కొనుగోలు చేయటం లేదు కాబట్టి వరి రైతులను వెంటనే ఆదుకోవాలి రైతులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు...

## గోవులు స్వాధీనం

విజయవాడ అక్రమంగా గత మూడు రోజులుగా గోవుల రవాణా చేస్తున్న వాహనాలు పట్టుకున్న గోరక్షకులపై కృష్ణలంక పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. కృష్ణలంక సర్కిల్ ఇన్స్ పెక్టర్ దుర్గారావు గోసంరక్షకులపై అసభ్య పదజాలం ఉపయోగించారని బాధితులు ఆరోపించారు. అదేమని ప్రశ్నించిన వారిని లారీ తొక్కితే ఏమి చేస్తావు అంటూ ప్రశ్నించారు. ఎక్కువ మాట్లాడితే బొక్కలో వేసి వుతుకుతానంటు బెదిరించారు. దాంతో రాష్ట్ర గోసంరక్షణ అధ్యక్షుడు సురేష్ కుమార్ విస్తూపోయి సిఐతో వాగ్వానికి దిగారు. కలెక్టర్, పోలీసు వున్న తాధి కారులకు ఫిర్యాదు చేస్తామని సురేష్ కుమార్ అనడంతో సిఐ మరింత రెచ్చిపోయారు. ఎవరికి చెప్పుకుంటా వో చెప్పుకో అంటూ హేళన చేసాడు. మానసికంగా హింసించడమే కాకుండా గోరక్షకుల్ని గోమాతని చులకన చేసినందుకు ప్రముఖ స్వామిజీ పీఠాధిపతి శివ స్వామి సోమవారం నాడు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ మరియు హిందూ సంఘాల ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. సదరు సిఐపై చర్యలు తీసుకోకపోతే గవర్నర్ కు ఫిర్యాదు చేస్తామని శివస్వామి అన్నారు. న్యాయం జరక్కుంటే ఆందోళనకు పిలుపు నిస్తామని శివస్వామి.. ఆర్ ఎస్ ఎస్ నేతలు వెల్లడించారు

## గిడుగు రుద్రరాజు అరెస్టు అన్యాయం

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు**

కడప కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సోమవారం అధాని అక్రమ వ్యాపారాలపై నిరసిస్తూ రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం ఇవ్వాలని బయలుదేరిన సమయంలో పోలీసులు వారిని విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దనే, వెళ్లనీయకుండా అరెస్టు చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆదాని గ్రూపులలో పెట్టుబడులను ప్రోత్సహించడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, హిండెన్ బర్గ్ రిపోర్ట్ ప్రకారం ఆదాని గ్రూపు కంపెనీలు డొల్ల కంపెనీలని, విషదమవుతున్నదని, అలాంటప్పుడు ఆదానీ గ్రూప్ కంపెనీలలో కేంద్రం ఏ విధంగా పెట్టుబడును ప్రోత్సహిస్తుందో తెలపాలన్నారు.దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని గవర్నర్ గారిని కోరడానికి బయలుదేరిన కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం సరైన చర్య కాదన్నారు.పోలీసు బలం ఉపయోగించే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు.ఇప్పటికైనా కేంద్రం అదానీ గ్రూపులలో పెట్టుబడులు విరమించుకొని, అదాని ఆర్థిక లావాదేవీల పై విచారణ చేపట్టడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలన్నారు.లేదా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపునిస్తామన్నారు

## దుగ్గిరాలపాడులో ఉద్రిక్తత

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడు లో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆంజనేయ స్వామి దేవాలయానికి గ్రామస్తులు కేటాయించుకున్న ప్రభుత్వ భూమిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టొదని గ్రామస్తులు

ఆందోళనకు దిగారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదు కానీ మరొక స్థలం లో నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. టెంట్ వేసుకొని నిరసన తెలిపారు. గుడి స్థలంలో భవిష్యత్తులో ఏదైనా ఆలయ నిర్మాణం చేపట్టాలంటే అవకాశం ఉండదు కనుక వ్యతిరేకిస్తున్నామని దుగ్గిరాలపాడు గ్రామస్తులు అన్నారు. పోలీసులు రంగప్రవేశం తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని గ్రామస్తులు అంటున్నారు.

# సామాన్యునిగా క్యూలైన్లో వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే



నంద్యాల ,నంద్యాల స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి తన సోదరి మరియు సతీమణితో వచ్చి క్యూ లైన్ లో నిలబడ్డారు, పట్టణానికి రారాజు తాను అనుకుంటే అధికారికంగా వెళ్ళి ఓటు వినియోగించుకునేవారు తనను గెలిపించిన వారే ఎమ్మెల్యేలుగా భావించి తాను సామాన్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు ప్రజాస్వామ్యంలో ప్రజల విలువ తెలిసిన ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.రాజ్యాంగం అందించిన ఓటు హక్కును, ప్రజాస్వామ్య విలువలను ఇనుమడింపజేసే విధంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర

### ప్రజలకంటే తోపులెవ్వరు లేరు ఇక్కడ



కిషోర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేసి తమ ఓటహక్కును వినియోగించుకున్నారు.ఎమ్మెల్యే సోదరి శిల్పా, సతీమణి 36వ వార్డు కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి క్యూ లైన్ లో నిలబడి ఓటు వేశారు.ప్రజాస్వామ్య విలువలు తెలిసిన ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని ఆయన కుటుంబాన్ని నంద్యాల ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు



కర్నూలు నియోజకవర్గం లోని ఒకటవ వార్డు నందు కర్నూలు మునిసిపల్ కార్పోరేషన్ ప్రైమరీ 8 ఫోర్ట్ స్కూల్ , బూత్ నెంబర్ 284 నార్త్ వింగ్ , పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నందు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అక్రమ అరెస్టును ఖండించండి



**అదాని ఆర్థిక అక్రమాలపై వెంటనే జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపిసి) వేయాలి**

**వేలాది మందితో కాంగ్రెస్ చలో రాజ్ భవన్ కార్యక్రమం విజయవంతం**

**-: నంద్యాల పార్లమెంటు జిల్లా డీసీసీ అధ్యక్షుడు , ఏఐసీసీ మెంబర్ జే లక్ష్మీ నరసింహ యాదవ్**

నంద్యాల మార్చి 13 -: ఉదయం విజయవాడ లో పార్టీ కార్యాలయం దగ్గర పిసిసి అధ్యక్షులు ని అక్రమ అరెస్టును లక్ష్మీ నరసింహ యాదవ్ ఖండించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు సోమవారం రోజు చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. అనంతరం పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ని అక్రమంగా అరెస్ట్ చేసి 1 టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఆధాని పది లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనం ను , యస్ బి ఐ , ఎల్ ఐ సి లో ఉన్న లక్షల కోట్ల ధనాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధాని కి అప్పనం గా కట్టబెట్టి ఈ దేశాన్ని ఆర్థికంగా అప్పుల ఉబిలోకి నెట్టేసింది అని , రాబోయే రోజులో ఎన్ని అక్రమాలు చూడాల్సి వస్తుంది అని ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు అని దేశ ప్రజలు ఇదంతా గమనిస్తున్నారు అని లక్ష్మీ నరసింహ యాదవ్ గారు పేర్కొన్నారు భారత దేశం నికు రాహుల్ గాంధీ గారి నాయకత్వం ఎంతైనా అవసరం అని ప్రజలు గ్రహించరు అని 2024 లో జరిగే ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యం అని రాష్ట్రం లో గిడుగు రుద్రరాజు గారి నాయక్త్వంలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించనిందని దానికి ఉదాహరణ ఈరోజు విజయవాడ లో జరిగిన చలో రాజ్ భవన్ కార్యక్రమం వేలాది మందితో నిర్వహించడం దీనికి నిదర్శనం అని లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు.

# వైసీపీ బలపరిచిన అభ్యర్థుల విజయం తథ్యం.

**- ధీమా వ్యక్తం చేసిన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి**

నంద్యాల రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సుస్థిర పరిపాలన వల్ల అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడుస్తున్నదని, ఈ సుపరిపాలనే నేడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులకు విజయాన్ని అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల భాగంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే,ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా,వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు సర్పంచులు, జడ్పిటిసి, ఎంపిపి, ఎంపీటీసీలు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్సిపి పార్టీ బలపరిచిన ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.- ఎమ్మెల్యే మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, వారు అందిస్తున్న సుపరిపాలనే నేడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవి రామచంద్రారెడ్డి,పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్షం టిడిపి పార్టీ అభ్యర్థిని కూడా నిలబెట్టలేని పరిస్థితిలో ఉందని ఏద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో డాక్టర్ మధుసూదన్ అఖండమైన మెజారిటీతో గెలవడం ఖాయమని వారు పేర్కొన్నారు.

# పరిగిలో ఎమ్మెల్సీ పోలింగ్

పరిగి వికారాబాద్ జిల్లా పరిగిలో ప్రారంభమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ .పరిగి నియోజకవర్గంలో మొత్తం 467 ఓట్లకు గాను 4 ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు పోలీసులు. పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పిఆర్టీయు ,టియుపిఎస్ తదీతర యునియన్లు తాము భారీ మెజార్టీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్నాయి.

# వైజయంతీ బ్యానర్లో శ్రీకాంత్ తనయుడు!




శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన రోషన్ కి ఇంకా సరైన సక్సెస్ పడలేదు. 'నిర్మలా కాన్వెంట్'...'పెళ్లి సందడి' లాంటి సినిమాలు రోషన్ ని హీరోగా ఎలివేట్ చేయడంలో పెద్ద సక్సెస్ సాధించ లేదు. హీరో మెటీరియల్ అయినా సరైన కథ కుదురకపోవడంతో? యంగ్ హీరో రేసులో వెనుకబడు తున్నాడు. వెనుకాల తండ్రి ప్రోత్సాహం ఉన్నా! అతని సపోర్ట్ పూర్తి స్థాయిలో కుదరడం లేదు.అందుకే ఇప్పుడు మేమున్నామంటూ వైజయంతీ బ్యానర్ రోషన్ కోసం ముందుకొచ్చింది. సోమవారం రోషన్ పుట్టిన రోజు సందర్భంగా యంగ్ హీరో ఆ కబురు ఒకటి వినిపించాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ లో ఓ సినిమా చేస్తున్నట్లు ప్రకటించాడు. ఈ సంస్థతో వేదాంస్ పిక్చర్ ప్రొడక్షన్స్ భాగస్వామ్య అవుంతుంది. రెండు సంస్థలు కలిసి రోషన్ తో సినిమా నిర్మించడానికి ముందుకొచ్చాయి.'అద్వైతం' లఘు చిత్రంతో జాతీయ అవార్డు అందుకున్న ప్రదీప్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇతనికి దర్శకుడిగా తొలి అవకాశం ఇదే. అంతకు ముందు కొన్ని షార్ట్ ఫిల్మ్స్ చేసాడు. ఆ ప్రతిభను గుర్తించే వైజయంతీ బ్యానర్ అవకాశం కల్పిస్తుందని సమాచారం.యాక్షన్ పీరియాడిక్ జోనర్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు తెలిసింది. త్వరలో సినిమాకి సంబంధించి పూర్తి వివరాలు వైజయంతీ సంస్థ ద్వారా అధికారికంగా బయటకు రానున్నాయి.రోషన్ కిది మంచి అవకాశం. ఇప్పటివరకూ పెద్ద బ్యానర్లో సినిమాచేసే అవకాశం రాలేదు. 'నిర్మలా కాన్వెంట్' సినిమా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించినా అప్పటికీ రోషన్ నటుడిగా షైన్ అవ్వలేదు. అందులో నటుడి వయసులోనూ కనిపించలేదు. ఆ రకంగా డెబ్యూ మంచి బ్యానరే అయినా పనవ్వలేదు. ఇక 'పెళ్లి సందడి' సినిమాకి బ్యాకెండ్ రాఘవేంద్రరావు నిలిచినా ప్రేక్షకుల్ని ఆ సినిమా మెప్పించలేకపోయింది.ఎలాగూ శ్రీలీల బయట పడింది గానీ..రోషన్ మాత్రం అక్కడే లాక్ అయ్యాడు. ఇప్పుడతన్ని వైజయంతీ బయటకు తెచ్చింది. నటుడిగా మరింత షైన్ చేస్తుందా సంస్థ. స్వప్నా దత్..ప్రియాంక దత్ లాంటి వారి చేతుల్లో పడితే షైనింగ్ తప్పనిసరే. ఇప్పటికే సిస్టర్స్ ఇద్దరు పలవురు ప్రతిభావంతుల్ని వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే.

# జిమ్మీ కిమ్మేల్ ని స్టేజ్ పై నుంచి దింపేసిన నాటు నాటు

95వ ఆస్కార్ వేడుకలలో ఆర్ఆర్ఆర్ సినిమా నుంచి నాటు నాటు సాంగ్ కి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అయితే ఆస్కార్ అవార్డుని మన సినిమా అందుకోవడం ఒక గొప్ప అచీవ్మెంట్ అయితే అంతకంటే ఎక్కువగా ఈ సారి ఆస్కార్ అవార్డుల వేడుక మొత్తం నాటు నాటు సాంగ్ మానియానే నడిచింది అని చెప్పాలి. ఆస్కార్ అవార్డుల వేడుక ఆరంభంలో హోస్ట్ గా చేసిన జిమ్మీ కిమ్మేల్ స్టేజ్ మీదకి వచ్చిన తర్వాత ఆర్ఆర్ఆర్ లో నాటు నాటు సాంగ్ గురించి ప్రస్తావించడం విశేషం.ఇక అవార్డులని ఇచ్చే కార్యక్రమానికి అతిథులని ఆహ్వానించిన తర్వాత నాటు నాటు హుక్ స్టెప్ తో జిమ్మీ కిమ్మేల్ ని స్టేజ్ పై నుంచి పుష్ చేసుకుంటూ లోపలికి తీసుకెళ్లడం హైలైట్ సీన్ అని చెప్పాలి. అక్కడితో మొదలైన నాటు నాటు బజ్ తరువాత కూడా కొనసాగింది.


స్టేజ్ మీద లైవ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చిన తర్వాత థియేటర్ లో ఉన్న హాలీవుడ్ ప్రముఖులు అందరూ కూడా స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి క్లాప్స్ కొట్టారు. ఇది నిజంగా మరుపురాని సంఘటనగా మన తెలుగు సినిమా చరిత్రలో నిలిచిపోతుంది.యితే హోస్ట్ జిమ్మీ కిమ్మేల్ ఆర్ఆర్ఆర్ ని బాలీవుడ్ సినిమాగా పరిచయం చేయడం తెలుగు ఆడియన్స్ కొంత అప్సెట్ అయ్యారనే చెప్పాలి. ఈ విషయాన్ని చాలా మంది తెలుగు ఆడియన్స్ ట్విట్టర్ లో కూడా పెట్టారు. ఏది ఏమైనా ఆస్కార్ వేదికపై తెలుగు ప్రజలు అందరూ గర్వంగా చెప్పుకునే స్థాయిలో మన నాటు పాటకి పట్టం కట్టడం గర్వకారణంగా భావించవచ్చు.ఇక ఇదే ఈవెంట్ లో మరో ప్యూర్ ఇండియన్ ట్రైబల్ బ్యాక్ డ్రాప్ డ్రాప్ లో ఆదిమజాతుల జీవన శైలిని రిప్రజెంట్ చేసిన ది ఎలిఫెంట్ విష్పరర్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ కి కూడా ఆస్కార్ రావడం నిజంగా గొప్ప విషయం. ఇందులో మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే ఈ రెండు కూడా సౌత్ నుంచి ఆస్కార్ పోటీలకి వెళ్లి సత్తా చాటడం. నాటు నాటు తెలుగు నేటివిటీ సాంగ్ అయితే. ది ఎలిఫెంట్ విష్పరర్ తమిళ్ నేటివిటీని రిప్రజెంట్ చేసిన డాక్యుమెంటరీ ఫిల్మ్.

# అవార్డు సొంతం చేసుకోలేకపోయిన ఆల్ దట్ బ్రీత్స్




ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ రోజు భారతీయులు అందరూ గర్వంగా చెప్పుకునే రోజు అని చెప్పాలి. ఇద్దరు ఆడవాళ్ళు బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ తో అంతర్జాతీయ వేదికపై మెరిసి ఆస్కార్ అవార్డుని అందుకున్నారు. భారతీయ మహిళల సత్తా ఏంటో అనేది ఈ షార్ట్ ఫిల్మ్ ప్రూవ్ చేసింది. వారు అనుకుంటే ఎలాంటి అద్భుతాలు అయిన చేస్తారని ప్రూవ్ చేసింది.ది ఎలిఫెంట్ విష్పరర్స్ షార్ట్ ఫిల్మ్. ఇక ఆర్ఆర్ఆర్ సినిమాలోని బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో నాటు నాటు పాట అవార్డుని సొంతం చేసుకుంది. ప్రతి తెలుగువాడు గర్వంగా దీనిని చూపించి మా నాటు పాటకి ప్రపంచం కట్టిన పట్టం ఇది అని చెప్పుకోవచ్చు. అలాగే తెలుగు సాహిత్యం యొక్క గొప్పతనం కూడా ఈ సాంగ్ తో అందరికి పరిచయం అయ్యింది. ఇదిలా ఉంటే ఈ వేడుకలలో ఇండియా నుంచి బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో ఆల్ దట్ బ్రీత్స్ అనే మూవీ కూడా నామినేట్ అయ్యింది.అయితే ఫైనల్ గా దీనికి కొంత నిరాశ ఎదురైంది అని చెప్పాలి. ఇక బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ అవార్డుని రష్యాకి చెందిన నావల్నీ సొంతం చేసుకుంది. ఇక ఢిల్లీలో రోజు రోజుకి పెరిగిపోతున్న కాలుష్యం కారణంగా మనుషులతో పాటు జంతువులు పక్షులు ఎలాంటి ఇబ్బంది పడుతున్నాయి అనే పాయింట్ తో షౌనక్ సేన్ ఈ సినిమాని తెరకెక్కించారు.రష్యన్ పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో నావల్నీ డాక్యుమెంటరీ ఫిల్మ్ తెరకెక్కింది. ఈ రెండింటి మధ్య పోటీ నడవడగా అకాడమీ సభ్యులు రెండో సినిమాకి ప్రాధాన్యత ఇచ్చారు. మొత్తానికి ఈ ఏడాది ఆస్కార్ వేడుకలలో రెండు సినిమాలతో ఇండియాకి గౌరవప్రదమైన స్థానం లభించగా ఆల్ దట్ బ్రీత్స్ చిత్ర యూనిట్ కి మాత్రం నిరాశ కలిగించింది అని చెప్పాలి. అయితే ఆస్కార్ ఫైనల్ పోటీల వరకు ఈ మూవీ వెళ్ళడం కూడా ఒక గొప్ప గౌరవంగా భావించాలి.

# కోహ్లీ విషయంలో స్మిత్ మొన్న అలా.. నిన్న ఇలా! బీసీసీఐ ట్వీట్ వైరల్



టీమిండియా- ఆస్ట్రేలియా మ్యాచ్ అంటే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇరు జట్ల మధ్య పోటాపోటీ క్రికెట్ ప్రేమికులకు మజా అందిస్తుంది.ఇక బోర్డర్- గావస్కర్ ప్రతిష్టాత్మక ట్రోఫీ గురించి చెప్పేదేముంది. సంప్రదాయ క్రికెట్లో ఇరు మేటి జట్లు తలపడుతుంటే ముచ్చటగా ఉంటుంది.అయితే, అదే సమయంలో స్లెడ్జింగ్ చేస్తూ శ్రుతిమించే ఆటగాళ్లను చూస్తే కాస్త చిరాకేస్తుంది. కానీ.. ఈసారి టీమిండియా- ఆసీస్ టెస్టు సిరీస్లో పిచ్ గురించి మినహా పెద్దగా మాటల యుద్ధాలు కనిపించలేదు. అందుకు భిన్నంగా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి- ఆస్ట్రేలియా తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్ మధ్య 'బ్రొమాన్స్' సన్నివేశాలు హైలైట్గా నిలుస్తున్నాయి.చాలా కాలం తర్వాత టెస్టుల్లో కోహ్లి అర్ధ శతకం నమోదు చేసిన తర్వాతస్మిత్ అతడికి దగ్గరికి వచ్చి బ్యాట్ చెక్ చేస్తూ.. ఆ తర్వాత ఇద్దరూ నవ్వుకుంటున్న దృశ్యాలు వైరల్ అయిన విషయం తెలిసిందే. బీజీటీ-2023లో ఆఖరిదైన అహ్మదాబాద్ టెస్టు మూడో రోజు ఆట సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది.ఇక ఆదివారం నాటి నాలుగో రోజు ఆటలో రన్మెషీన్ కోహ్లి హాఫ్ సెంచరీని శతకంగా మలిచిన సంగతి తెలిసిందే. కెరీర్లో 75వ అంతర్జాతీయ సెంచరీ నమోదు చేసిన కోహ్లి.. డబుల్ సెంచరీ దిశగా పయనించగా టాడ్ మర్ఫీ బౌలింగ్లో 186 పరుగుల వద్ద బ్రేక్ పడింది.దీంతో కోహ్లి పెవిలియన్ చేరుతున్న సమయంలో అతడిని అభినందించిన స్మిత్.. కోహ్లి చేతిలో చెయ్యి వేసి శభాష్ అన్నట్లుగా వెన్నుతట్టాడు. తన పట్ల స్మిత్ ఆప్యాయతకు బదులుగా కోహ్లి చిరునవ్వులు చిందించాడు. ఇందుకు సంబంధించిన ఫొటోను.. "పరస్పర గౌరవం.. ఆరాధ్య భావన" అంటూ బీసీసీఐ ట్విటర్లో షేర్ చేయగా వైరల్ అవుతోంది.ఈ నేపథ్యంలో టీమిండియా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "స్మిత్ నిన్ను ఇలా చూస్తుంటే బాగుంది. కింగ్ కోహ్లిని నువ్వు అభినందించిన తీరు మా హృదయాలు గెలుచుకుంది. ఆటలో మాత్రమే ప్రత్యర్థులు.. ఆటగాళ్లంతా ఒక్కటే అని మరోసారి నిరూపితమైంది. ఈ ఫొటో ఎంత బాగుందో!" అని కామెంట్లు చేస్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190